తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | ఆదివారం | 30- 11 - 2025 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజీలు : 2

# ఎమ్మెల్యే గారూ..
# మోత్కూరులో వైన్‌షాపులను ఊరి బయటకు పంపండి

## మహాత్ముడు పూలే విగ్రహం ఎదుటే ఎదురెదురుగా రెండు వైన్స్‌లు

### పొలిటికల్ నిర్ణయంతోనే సాధ్యం

- మోత్కూరు పట్టణ ప్రజలు, నాయకుల డిమాండ్
- విన్నవించినా పట్టించుకోని ఆఫీసర్లు
- ప్రభుత్వ స్కూల్, కాలేజీలకు వెళ్లే బాటలో, బస్‌స్టాప్ వద్దే వైన్స్‌లు
- స్వచ్ఛ మున్సిపాలిటీ, ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం
- ఊరి బయట వైన్స్‌ల ఏర్పాటుతో సమస్యలన్నింటికీ చెక్



**ప్రజావారధి/మోత్కూరు**
మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఇళ్ల మధ్య, రోడ్ల వెంట వైన్‌షాపుల ఏర్పాటును ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటి వరకు నడిచిన వైన్‌షాపులన్నీ ఇళ్ల మధ్య, రోడ్ల వెంట ఏర్పాటు చేయడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు, అసౌకర్యానికి గురవడంతో పాటు వైన్‌షాపుల ముందు బైకులు, కార్లు ఇతర వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. కొత్త వైన్‌షాపులు ఖరారైన నాటి నుంచే పట్టణ ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థులంతా ముకుమ్మడిగా వైన్‌షాపులు ఊరి బయట ఏర్పాటు చేయాలన్న డిమాండ్లతో ఆందోళనలు, మున్సిపల్, ఎక్సైజ్ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఎలాంటి ఫలితం లేకపోయింది. ఎవర్ని ఎలా మేనేజ్ చేశారో తెలియదు గాని మున్సిపల్ కేంద్రంలో నాలుగు వైన్‌షాపులను మళ్లీ యథావిధిగా ఇళ్ల మధ్య, మెయిన్ రోడ్డు వెంటనే ఏర్పాటు చేస్తుండటంతో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంబేద్కర్ విగ్రహానికి కూతవేటు దూరంలో, మరీ ముఖ్యంగా మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి 20 అడుగుల దూరంలోనే మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఎదురెదురుగా రెండు వైన్‌షాపులు ఏర్పాటు చేస్తుండటంతో బీసీల ఆరాధ్యుడు జ్యోతిరావుపూలేను అవమానించడమేనని బీసీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారి చెరువు సమీపంలో మెయిన్ రోడ్డు వెంట, ప్రభుత్వ కాలేజీకి వెళ్లే దారి, బస్‌పాప్ వద్దనే వైన్స్‌లను ఏర్పాటు చేస్తుండటంతో విద్యార్థులపై చెడు ప్రభావం పడే అవకాశముంది. మందుబాబుల చేష్టలతో, బీహార్, యూపీ లాంటి ఇతర రాష్ట్రాల నుంచి 2లో..

తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
ఆదివారం



# ఎమ్మెల్యే గారూ..వైన్స్‌లను ఊరి బయటకు పంపండి






**మొదటి పేజీ తరువాయి..**

వచ్చిన కార్మికులు ఫూటగా తాగి ఒళ్లు మరిచి ఒంటి బట్టలు లేకుండా ప్రవర్తిస్తుండటంతో విద్యార్థినులు, మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎవరు ఉన్నది చూడకుండా రోడ్ల వెంటనే మూత్ర విసర్జన చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కాలేజీ వెళ్లే దారి, అదే రూట్‌లో ఆరెగూడెం, ముశిపట్ల, దత్తప్పగూడెం గ్రామాలకు వెళ్లే బస్‌స్టాప్ వద్దనే వైన్‌షాపు ఉండటంతో అక్కడ పరిస్థితి మరీ అధ్వానంగా తయరైంది. వైన్‌షాపులకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న సిట్టింగులు కూడా బార్లను తలపించేలా ఉంటుండటంతో మందు బాబులు తాగినంక మాట్లాడే మాటలు, ఒక్కో సందర్భంగా జరిగే గొడవలతో చుట్టుపక్కల ఇళ్ల ప్రజలు బయటకు రాలేని పరిస్థితులు ఉన్నాయి. రాత్రిళ్లు ఇళ్ల ముందే మలమూత్ర విసర్జనలు చేయడం, ఇళ్ల గోడలపై పాన్‌పరాక్‌లను ఉమ్మే యడం చేస్తుండటంతో అసభ్యంగా తయారవడంతో తీవ్ర దుర్వాసనలతో రోగాల పాలవుతున్నారు. పట్టణంలో ప్రధాన చౌరస్తాలు, రోడ్ల వెంటే వైన్‌షాపుల ఏర్పాటుతో స్వచ్ఛ మున్సిపాలిటీకి తీవ్ర ఆటంకం కలుగుతోంది. భువనగిరి రోడ్డులో జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద ఎదురెదురుగా వైన్‌షాపుల ఏర్పాటుతో అక్కడ ఇప్పటికే రోడ్డు ఇరుకుగా ఉండటం, మూలమలుపు, డివైవర్ డైవర్షన్ ఉండటంతో ట్రాఫిక్ తీవ్ర ఇబ్బందులు ఏర్పడటంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.



## పొలిటికల్ నిర్ణయంతోనే సాధ్యం

వైన్‌షాపులు పట్టణంలో ఇళ్ల మధ్య, మెయిన్ రోడ్డు వెంట ఏర్పాటు చేయవద్దని ప్రజలు, కాంగ్రెస్‌తో సహా రాజకీయ పార్టీల నాయకులంతా మొత్తుకుంటున్నా మద్యం వ్యాపారులు మాత్రం అవేవీ పట్టకుండా వైన్‌షాపులను యథావిధిగా ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, మోత్కూరు ఎక్సైజ్ సర్కిల్ సీఐ, కలెక్టరేట్‌లో ప్రజలు, అఖిలపక్ష పార్టీల నాయకులు వినతిపత్రాలు ఇచ్చినా, మోత్కూరు ఎక్సైజ్ సర్కిల్, మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో పట్టణ ప్రజలు, నాయకులంతా వైన్స్‌లను పట్టణం నుంచి ఊరి బయట ఏర్పాటు చేసేందుకు పొలిటికల్ నిర్ణయంతోనే సాధ్యమని, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ జోక్యం చేసుకుని పట్టణ ప్రజలు, విద్యార్థుల బాగోగులను దృష్టిలో పెట్టుకుని వైన్‌షాపులను ఊరి బయట ఏర్పాటు చేయించాలని, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బెల్ట్‌షాపులు, వైన్‌షాపుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారని, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చేస్తున్న విధంగా ఎమ్మెల్యే మందుల సామేల్ వైన్‌షాపులను పట్టణానికి దూరంగా పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మోత్కూరు చుట్టుపక్కల ఉన్న ఆత్మకూరు(ఎం), గుండాలతో పాటు ఇతర మండల కేంద్రాల్లో వైన్‌షాపులన్నీ ఊరి బయటే ఉన్నాయని, తాగేవాడు ఎక్కడికైనా వెళ్లి తాగుతాడని, స్వచ్ఛ మున్సిపాలిటీ లక్ష్యం దెబ్బతినకుండా పట్టణంలో నాలుగు వైన్‌షాపులను ఊరి బయటకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రయోజనాలను పట్టించుకోండా పట్టణంలో వైన్‌షాపుల ఏర్పాటుతో ఇంత వ్యతిరేకత వస్తున్నా మద్యం వ్యాపారులు తమ వ్యాపారం కోసం కొందరిని మేనేజ్ చేయడంతోనే వైన్‌షాపులను ఎప్పటిలానే పట్టణంలో ఇళ్ల మధ్య, రోడ్ల వెంట ఏర్పాటు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా జ్యోతిరావుపూలే విగ్రహం వద్దనే రెండు వైన్‌షాపులు ఏర్పాటు చేస్తుండటంతో ప్రజలు, బీసీ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుంది.